క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికే 'స్పందన'



పెద్దాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పందనకు డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్పందనకు వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూమి రీసర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మారాయని, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేశామని అన్నారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుస్ ఉత్సవాలు



దర్గా వద్ద అన్నప్రసాద వితరణ చేస్తున్న ముస్లింలు

పెద్దాపురం: మూడు రోజుల పాటు నిర్వహించిన హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా ఉరుస్ గంధోత్సవం సోమవారంతో ముగిసింది. సాహెబ్ సమాధి వద్ద మతాలకతీతంగా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ చైర్మన్ ఎంఎల్ అలీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా ఉరుస్ ఉత్సవం నిలుస్తుందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణను ఆయన ప్రారంభించగా, సుమారు ఐదు వేల మంది ప్రసాదం స్వీకరించారు. అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు బంగారుబాబు, బాబూలాల్, ఆశిక్ ఆలీ, అబ్దుల్ రజాక్, రఫీ, గౌస్, షేక్ జాజ్జి, జలీల్, జాకీర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డీన్ ప్రసన్నకుమార్

పెద్దాపురం: ఉద్యాన పంటల సాగులో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని పార్వతీపురం ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం కట్టమూరు గ్రామంలో ఉద్యాన శాస్త్రవేత్త జానకి అధ్యక్షతన రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వినూత్న యాజమాన్య పద్ధతులపై రైతులు దృష్టి సారించాలన్నారు. చీడపీడల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సులో అసోసియేట్ రిప్రజెంటేటివ్ అరుణకుమారి, కట్టమూరు సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, నల్లల గోవింద్, పెంటా విజయ్‌కుమార్, జీను రమణ, పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ' విద్యార్థి ప్రతిభ



జయదీప్‌ను అభినందిస్తున్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ

కాకినాడ రూరల్: తిమ్మాపురం పంచాయతీ అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగ విద్యార్థి రేవు బాల జయదీప్ జాతీయ స్థాయిలో యూజీసీ సెట్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ సాధించాడు. ఈ సందర్భంగా పీజీ సెంటర్‌లో జయదీప్‌ను ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ, కోర్సు కో ఆర్డినేటర్ కె.జోసెఫ్ స్టీఫెన్, విభాగ సహాయ ఆచార్యులు ఎం.నానిబాబు, హరిబాబు, గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వరహాలు తదితరులు అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సివిల్స్ సాధించడమే లక్ష్యమని విద్యార్థి జయదీప్ తెలిపారు. జయదీప్ తండ్రి నారాయణస్వామి రంగరాయ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ఆకట్టుకున్న కచేరీ

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి నృత్యోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో నాలుగో రోజు పండిట్ మొహిసిన్ సితార్, అరణ్యకుమార్ ఎస్రాజ్ వాయిద్యాలతో కచేరీ అద్భుతంగా జరిగింది. వీరికి తబలాపై ఉస్తాద్ నజ్ముద్దీన్ జావెద్ చక్కటి సహకారాన్ని అందించారు. తొలుత కార్యక్రమాన్ని ద్విభాష్యం నగేశ్‌బాబు, సుభాషిణి ప్రారంభించారు.



సామర్లకోట పాత్రుళ్లపేట రామాలయం నుంచి ఊరేగింపులో పాల్గొన్న ఆవాల రాజేశ్వరి, లక్ష్మీనారాయణ



హుస్సేన్‌పురం రామాలయంలో భక్తుల పూజలు



కాండ్రకోటలో రామాలయ కమిటీ సభ్యుల ప్రదర్శన



గొల్లప్రోలులో శ్రీరాముడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పావన రామ.. సుగుణాభిరామ

- ఊరూరా మార్మోగిన రామనామం
- అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠ వేళ వేడుకలు
- కళకళలాడిన గ్రామాలు

సామర్లకోట: కోట్లాది మంది భారతీయుల స్వప్నం.. అయోధ్యలోని రామమందిరం.. ఎన్నో ఏళ్ల నాటి కల సాకారం అవుతున్న వేళ రామ భక్తుల మది పులకించింది.. పావనరామ.. సుగుణాభిరామ అంటూ ఆ స్వామిని భక్తజనం కొలిచింది. సోమవారం అయోధ్యలో శ్రీరామ జన్మభూమి మందిరం ప్రారంభం, బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పెద్దాపురం నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, పట్టణాల్లో ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించారు. శ్రీరామ నామ స్మరణతో భక్తిని నింపుకొని ముందుకు కదిలారు. ర్యాలీల అనంతరం ఆలయాల్లో భజనలు, సంకీర్తనలు నిర్వహించి ప్రసాద వితరణలు చేశారు. దీంతో అంతటా ఆధ్యాత్మికత నిండింది. సామర్లకోట 15వ వార్డు రామాలయంలో రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తుల విగ్రహాలను పల్లకిలో ఉంచి ఊరేగించారు. రాజేశ్వరి దంపతులు పల్లకి మోస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్తు సభ్యుడు జీవీకే మోహనరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ ఆలయం నుంచి ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణ పరిధిలోని మార్వాడీల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు భారీ ఎత్తున ప్రదర్శన చేపట్టారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్ చేరుకుని ఆనంద నృత్యాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, కౌన్సిలర్లు సేపెని సురేష్, పాగా సరేష్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు, నాయకులు బత్తుల భరత్, అడబాల వీరభద్రరావు, మర్వాడీ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ప్రతి గ్రామంలోని రామాలయాలు, పట్టణ పరిధిలోని రామాలయాల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. హుస్సేన్‌పురంలో విశ్వహిందూ పరిషత్తు సభ్యులు అమలకంటి చంటిబాబు, చల్లా బుజ్జి ఆధ్వర్యంలో రామాలయం నుంచి ఊరేగింపు చేపట్టారు. భజనలు చేస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంట సాయంత్రం ఐదు దీపాలు వెలిగించారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమిలో బాల రాముని ప్రతిష్ఠను పురస్కరించుకొని పట్టణంలోని మాంసం, చేపల విక్రయాలను నిషేధించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఇచ్చిన ఆదేశాలు పక్కాగా అమలు జరిగాయి.



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో మర్వాడీల ఆధ్వర్యంలో నిర్వహించిన మానవహారం

శ్రీరామ నామం... మనసు పావనం

పెద్దాపురం: శ్రీరామ నామ జపంతో పెద్దాపురం అర్బన్, రూరల్‌లోని ఆయా గ్రామాలు మార్మోగాయి. అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవంలో భాగంగా పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కాండ్రకోట, ఆర్‌బీ పట్నం, దివిలి, జి.రాగంపేట, తిరుపతి, చదలాడ, కట్టమూరు, గుడివాడ, సిరివాడ తదితర గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించి సామూహిక భజనలు, నగర సంకీర్తనలు చేపట్టారు. ఆయా గ్రామాల రామాలయ కమిటీలు, భక్తులు పాల్గొన్నారు.

ఊరూవాడా వేడుకలు

పిఠాపురం: శ్రీరామ నవమి రెండు నెలలు ముందే వచ్చేసిందా అన్నట్టుగా మారాయి రామాలయాలు. రామాలయం లేని ఊరు లేదనేది ఎంత నిజమో.. సోమవారం నాడు శ్రీరామ నామం పలకని ఊరూవాడా లేదనేది అంతే నిజమని నిరూపించారు శ్రీరామ భక్తులు. ఎక్కడ చూసినా శ్రీరామ నామం మార్మోగింది. అయోధ్యలో శ్రీరామ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకుని పిఠాపురం నియోజకవర్గంలో వేడుకలు జరుపుకొన్నారు. అన్ని రామాలయాల్లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శ్రీరాముడి గ్రామోత్సవాలు శోభాయమానంగా జరిగాయి. పిఠాపురం పాదగయ క్షేత్రంలో శ్రీరామ ప్రతిష్ఠ కార్యక్రమ వీక్షణకు ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పిఠాపురం పట్టణంలో శ్రీరాముడి శోభాయాత్ర కనులపండువగా నిర్వహించారు. గొల్లప్రోలులో శ్రీరామ ప్రసాద వితరణ చేశారు. చేబ్రోలులో సీతారామస్వామి ఆలయం, సాయి వీరాంజనేయ ఆలయం, ఇతర రామాలయాల్లోను ప్రత్యేక పూజలు భజనలు, అన్నదానాలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా, హరేరామ సంకీర్తనలు ఆలపించారు. పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో సోమవారం శ్రీరామ ప్రతిష్ఠ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాల్లో శ్రీరాముడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వేలాది మంది భక్తులు టీవీల్లో అయోధ్య శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను వీక్షించారు.

మార్మోగిన రామనామ స్మరణ

కొత్తపల్లి: అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం గ్రామాలు రామనామ స్మరణలో మార్మోగాయి. రామాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక ఊర చెరువు సెంటర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, దున్న చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో శ్రీరామ సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు



చేబ్రోలులో శ్రీరాముడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గొల్లప్రోలులో స్వామివారి ప్రసాద వితరణ



ఆర్‌బీ పట్నంలో ర్యాలీ చేస్తున్న భక్తులు



పాదగయ క్షేత్రంలో భారీ స్క్రీన్లపై అయోధ్య రాముడి ప్రతిష్ఠను తిలకిస్తున్న భక్తులు

ప్రతిభ చాటే వేదిక 'ఆడుదాం-ఆంధ్రా'

- మున్సిపల్ కమిషనర్ రామారావు
- నియోజకవర్గ క్రీడాకారులకు కిట్ల పంపిణీ

సామర్లకోట: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమం చక్కని వేదికలా నిలుస్తుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. 'ఆడుదాం- ఆంధ్రా' మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఆయన సోమవారం స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మంచి ప్రతిభ కనబరిచి సామర్లకోటకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పురుషుల వాలీబాల్ పోటీలో బ్రౌన్‌పేట టీమ్, క్రికెట్‌లో బళ్ల మార్కెట్ టీమ్, షటిల్ బ్యాడ్మింటన్‌లో ఇస్మాయిల్‌నగర్ టీమ్, కబడ్డీలో సత్యనారాయపురం జట్టు, మహిళల షటిల్ బ్యాడ్మింటన్‌లో గోలివారి వీధి టీమ్, ఖోఖోలో బళ్ల మార్కెట్ టీమ్‌లు నియోజకవర్గ పోటీలకు ఎంపికయ్యాయన్నారు. వీరికి క్రికెట్ కిట్లు, షటిల్ బ్యాట్‌లు, టీషర్టులు అందజేశారు. మంగళవారం నుంచి నియోజకవర్గ స్థాయిలో పోటీలు పెద్దాపురం మహారాణి కళాశాల ఆవరణలో జరుగుతాయని కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, చిట్టుమాని రాఘవ, నమ్మి దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టుమాని శ్రీనివాసరావు, నమ్మి శ్రీను, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సామర్లకోట మహిళల షటిల్ టీమ్‌కు బ్యాట్‌లు అందజేస్తున్న కమిషనర్ తదితరులు

హోటళ్లపై అధికారుల దాడులు

- రాయితీ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానికంగా హోటళ్లపై మండల సివిల్ సప్లయిస్ అధికారులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'ష్.. పక్కదారికి గ్యాస్' అనే శీర్షికతో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి సూచనల మేరకు ఎంఎస్‌ఓ కీర్తి ఆధ్వర్యంలో వీఆర్వోలు హోటళ్లలో తనిఖీలు చేశారు. ఇళ్లలో ఉపయోగించాల్సిన రాయితీ గ్యాస్ సిలిండర్లు వ్యాపార సంస్థలైన హోటళ్లలో వినియోగించడంపై ఏడు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. సదరు హోటళ్ల నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు ఎంఎస్‌ఓ కీర్తి తెలిపారు. వ్యాపారస్తులు కేవలం కమర్షియల్ సిలిండర్లు మాత్రమే ఉపయోగించాలని ఆమె సూచించారు. ఇప్పటికే కేసులు నమోదు చేసిన హోటళ్ల నిర్వాహకులు మరో పర్యాయం పట్టుపడితే వ్యాపార సంస్థలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



హోటల్ నుంచి వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

రామ నామం.. దేదీప్యం



శ్రీరామ నామంతో దీపాల అలంకరణ

సామర్లకోట: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి ప్రతి ఇంటా దీపాలను వెలిగించారు. ఈ మేరకు స్థానిక పంచారామ క్షేత్ర దీపారాధన సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నామంతో దీపాలంకరణ చేశారు. ఇది భక్తులను ఆకట్టుకుంది.

లెక్క తేలింది

- నియోజకవర్గంలో 2,11,937 మంది ఓటర్లు
- తుది జాబితా ప్రకటించిన పెద్దాపురం ఆర్డీఓ

పెద్దాపురం/ సామర్లకోట: ఓటర్ల లెక్క తేలింది.. తుది జాబితా విడుదలైంది.. రానున్న ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ఈ జాబితాను అధికారులు విడుదల చేశారు. పెద్దాపురం నియోజకవర్గంలో 2,11,937 మంది ఓటర్లతో తుది జాబితా ప్రకటించినట్లు ఆర్డీఓ జె.సీతారామారావు వెల్లడించారు. స్థానిక ఆర్డీఓ కార్యాయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఏడాది అక్టోబర్ 27న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించామన్నారు. అప్పటికి నియోజకవర్గంలో 1,03,001 మంది పురుషులు, 1,05,916 మంది మహిళలు, 13 మంది ఇతరులతో కలిపి 2,08,930 మందితో జాబితా ప్రకటించామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరిగి ఓటు నమోదు ప్రక్రియ, క్లెయిమ్‌ల పరిష్కారం, సవరణల తర్వాత ఓటర్ల తుది జాబితాను విడుదల చేశామన్నారు. ప్రస్తుతం పెద్దాపురం నియోజకవర్గంలో పురుషులు 1,04,446, మహిళలు 1,07,478, ఇతరులు 13 మందితో కలిపి 2,11,937 మంది ఓటర్లతో తుది జాబితా ప్రచురించినట్లు ఆర్డీఓ తెలిపారు. ఇదే తుది జాబితా అని ఒకవేళ ఎవరైనా మిగిలిపోయినా, అర్హత ఉంటే కొత్తగా ఓటు హక్కు కల్పిస్తామని వివరించారు.

పిఠాపురంలో ఓటర్లు 2.3 లక్షలు

పిఠాపురం: నియోజకవర్గంలో 2,30,046 మంది ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. వీరిలో పురుషులు 1,15,223 మంది, స్త్రీలు 1,14,819, హిజ్రాలు నలుగురు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో 242 పోలింగ్ బూత్‌లు ఉన్నట్టు పిఠాపురం తహసీల్దారు పి త్రినాథ్‌రావు తెలిపారు. గత ఏడాది అక్టోబర్‌లో ఎన్నికల సంఘం ప్రచురించిన ఓటర్ల జాబితాను సవరించినట్టు చెప్పారు. విచారణల అనంతరం సవరించిన జాబితాలో 8,333 మంది కొత్త ఓటర్లను చేర్చినట్టు తెలిపారు. చనిపోయిన 1,387 మంది ఓట్లను తొలగించినట్టు, శాశ్వతంగా ఇక్కడ లేకుండా వెళ్లిపోయిన 3,986 ఓట్లు, డబుల్ ఎంట్రీలు 1,120 ఓట్లు మొత్తం 6,493 ఓట్లు తొలగించినట్టు వివరించారు. మొత్తం ఓటర్లలో 18–19 వయసు ఉన్న ఓటర్లు 3,616, దివ్యాంగులు 2,664 మంది, సర్వీసు ఓటర్లు 142 మంది, సెక్స్ వర్కర్లు 602 మంది ఉన్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, పూర్తి వివరాలు అందజేశామన్నారు. ముసాయిదా సమయంలో ఒక ఇంటి నంబరుతో పది మంది కంటే ఎక్కువ ఉన్న ఓట్లు 136 ఉండగా, డోర్ నంబర్ సరిదిద్దినట్టు ఆయన తెలిపారు. జంక్ క్యారెక్టర్లు ఉన్న ఇళ్లు 68 ఉండగా, వాటిని కూడా సరిచేసినట్టు వివరించారు. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, తాగునీరు, ర్యాంపులు సిద్ధం చేసినట్టు తెలిపారు.



ఓటర్ల జాబితా వివరాలు తెలుపుతున్న ఆర్డీఓ రామారావు



రాజకీయ నాయకులతో సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ త్రినాథ్‌రావు

పిఠాపురం నియోజకవర్గ ఓటర్ల వివరాలు

ప్రాంతం	మొత్తం ఓటర్లు	పురుషులు	స్త్రీలు	హిజ్రాలు
గొల్లప్రోలు మండలం	43,126	21,997	21,127	2
గొల్లప్రోలు నగర పంచాయతీ	20,109	10,068	10,040	1
పిఠాపురం మండలం	60,626	30,816	29,810	0
పిఠాపురం పట్టణం	41,356	19,956	21,399	1
కొత్తపల్లి మండలం	64,829	32,386	32,443	0

చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత

కాకినాడ సిటీ: చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ సంరక్షణ అధికారి ఎస్.భరణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్‌కోర్, పాఠశాల విద్యాశాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల సంరక్షణ అవగాహనలో భాగంగా సోమవారం స్థానిక గాంధీనగర్ శాఖా గ్రంథాలయం (వివేకానంద పార్కు) వద్ద జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 23 పాఠశాలల నుంచి 114 మంది విద్యార్థులు హాజరయ్యారు. చిత్తడి నేలలు, వాటి సంరక్షణపై చక్కని చిత్రాలను విద్యార్థులు గీశారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా అటవీ సంరక్షణ అధికారి భరణి హాజరై మాట్లాడుతూ చిత్తడి నేలలు, మడ అడవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జీవితంలో చిన్న, చిన్న మార్పులు చేసుకున్నప్పుడే పర్యావరణ పరిరక్షణలో పెద్ద ఫలితాలను పొందవచ్చన్నారు. పాలిథిన్ సంచుల వాడకాన్ని ప్రజలు నిషేధించాలన్నారు. మొక్కలు పెంచడం జీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. మడ అడవులు కాకినాడ పరిసర ప్రాంతాలను తుపాన్ల బారి నుంచి కాపాడుతున్నాయని, అటువంటి మడ అడవులను రక్షించాలని డీఎఫ్‌ఓ అన్నారు. జీవ వైవిధ్యం పరిరక్షణకు అంతా కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిత్తడి నేలల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శాఖా గ్రంథాలయ అధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అటవీ క్షేత్రాధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయకర్త కేవీకే మహేశ్వరరావు, చిన్నబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చిత్తడి నేలల సంరక్షణపై గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

యువకుడి మృతి

తుని: రైలు నుంచి జారిపడి యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...తుని నుంచి విశాఖపట్నం వైపు వెళ్లున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి 30 ఏళ్ల యువకుడు గుల్లిపాడు–నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు.

బాలాత్రిపుర సుందరికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పాలతో పూజ నిర్వహించారు. గులాబీ, చామంతితో పాటు వివిధ రకాల పుష్పాలతో ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కంచర్ల సత్తిరాజు, రజని, శేషారావు, మాధవి, సత్యగున్న రత్నం పుష్పాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.